# తరగతి గదుల్లేక విద్యార్థుల అవస్థలు



కల్వకోలు ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్టు కింద తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

- ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు
- అసంపూర్తిగా గదుల నిర్మాణం
- శిథిలావస్థకు చేరిన తరగతి గదులు



పెద్దకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో కూలడానికి సిద్ధంగా ఉన్న గది

**పెద్దకొత్తపల్లి:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గదుల కొరత విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోంది. మండలంలో 9 ఉన్నత పాఠశాలలు, 36 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. వాటిలో 3,763 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

**శిథిలావస్థలో పాఠశాల గదులు**

పెద్దకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో రెండు గదులు శిథిలావస్థకు చేరాయి. అదనపు గదిని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఈ పాఠశాలలో 120 మంది విద్యార్థులు ఉన్నారు. నక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో రెండు గదులు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం తరగతులు చెట్ల కింద నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 62 మంది విద్యార్థులున్నారు. కల్వకోలు ప్రాథమిక పాఠశాలలో గదులన్నీ శిథిలావస్థకు చేరాయి. కొత్తగా నిర్మించిన అదనపు గదుల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో విద్యార్థులకు చెట్ల కింద, వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో గదులు లేవు, ప్రభుత్వ పశువుల ఆస్పత్రి, మహిళా సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. మూడేళ్లుగా 10వ తరగతి ఫలితాల్లో ముష్టిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపుతున్నారు. పాఠశాలలో వసతుల్లో మాత్రం అధమంగా ఉంది. ముష్టిపల్లి ఉన్నత పాఠశాలకు 'మన ఊరు–మన బడి' పథకం కింద గదుల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ రెండు ఫ్లోర్లు నిర్మించి అసంపూర్తిగా వదిలిపెట్టాడు. తరగతి గదుల్లేక విద్యార్థులు చెట్ల కింద, గ్రామ పంచాయతీ గదులు, మహిళా సమాఖ్య గది, పశువైద్య శాల గది, ప్రాథమిక పాఠశాల గదులను ఉపయోగించుకొని ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 137 మంది విద్యార్థులు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్య నభ్యసిస్తున్నారు. 67 మంది బాలికలు ఉన్న పాఠశాలలో ఒకటే మూత్రశాల, మరుగుదొడ్డి ఉన్నాయి.

**బాలికలకు ఇబ్బందులు తప్పడం లేదు.**

వంట ఏజెన్సీ మహిళలకు వంట గదులు లేక ఆరు బయటనే వంటలు చేస్తున్నారు. వర్షం వస్తే ఇబ్బందులు తప్పడంలేదు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోసం గ్రామస్తులు 123 సర్వేనంబర్‌లో రైతు వద్ద 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పాఠశాలకు అప్పగించారు. కాంట్రాక్టర్ పాఠశాల గదుల నిర్మాణం చేసి బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే వదిలేశాడు. గదుల నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలెక్టర్‌కు విన్నవించారు. నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో చెట్ల కింద, వరండాల్లో విద్యార్థులకు బోధన చేస్తున్నారు. గ్రామ పంచాయతీ భవనంలో గ్రామ సభలు నిర్వహించినప్పుడు విద్యార్థులకు తరగతులు నిర్వహించకుండా చెట్ల కింద కూర్చబెడుతున్నారు. అసంపూర్తి గదుల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చే యాలని విద్యార్థులు,ఉపాధ్యాయులు కోరుతున్నారు.

### ప్రతిపాదనలు పంపించాం..



మండలంలోని పెద్దకొత్తపల్లి, నక్కలపల్లి, బాచారం,కల్వకోలు ప్రాథమిక పాఠశాలలు, ముష్టిపల్లి ఉ న్నత పాఠశాల, పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం కోసం నిధుల మంజూరు చేయాలని జిల్లా అధికారులకు నివేదికలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే అదనపు గదుల నిర్మాణం చేపట్టి విద్యార్థుల ఇబ్బందుల తొలగిస్తాం.

– కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ, పెద్దకొత్తపల్లి

### గదుల్లేక అవస్థలు పడుతున్నాం..



ముష్టిపల్లి ఉన్నత పాఠశాలల్లో ఐదు తరగతులకు తరగతి గదుల్లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతూ పాఠాలు చెబుతున్నారు. పశువైద్య శాల, మహిళా సమాఖ్య, గ్రామ పంచాయతీలలో తరగతులు చెప్పడం వల్ల మాకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కొత్త గదుల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి.

– ప్రవీణ్‌కుమార్, 9వ తరగతి, ముష్టిపల్లి

### మూత్రశాలల్లేక ఇబ్బంది పడుతున్నాం..



ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థుల్లో 67 మంది బాలికలు ఉన్నారు. అందరికి ఒకే మూత్రశాల, మరుగుదొడ్డి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాల నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తే మా ఇబ్బందులు తొలిగిపోతాయి.

– శిరీష, 9వ తరగతి, ముష్టిపల్లి

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో గురుపౌర్ణమి వేడుకలు



వెల్దండలో..



తాడూరులో హోమం చేస్తున్న భక్తులు

**సాక్షి, నెట్‌వర్క్:** పెంట్లవెల్లి మండల కేంద్రంలో సాయిబాబా మందిరంలో గురువారం సాయినాథునికి గురుపౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి, మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

❖ ఉప్పునుంతల మండల కేంద్రంలో బాలుర ప్రాథమిక పాఠశాలలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

❖ కోడేరు మండల కేంద్రంలో దేవాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు.

❖ తాడూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల పాఠశాలల్లో సరస్వతి చిత్రపటానికి పూల మాలలు వేశారు.

❖ దోమలపెంట, ఈగలపెంటలోని సాయిమందిరంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

❖ లింగాల మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువులను ఘనంగా సన్మానించారు.

❖ తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

❖ వెల్దండ మండలంలోని గుండాల ఏకలవ్య పాఠశాలలో సరస్వతీ దేవి చిత్ర పటానికి పూలమాలలు వేశారు.

❖ తాడూరు మండలంలోని సిర్సవాడలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి యజ్ఞాలు, హోమం నిర్వహించారు.

# ఆస్పత్రిలో 4.1కిలోల శిశువు జననం



తల్లీబిడ్డతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి

**కందనూలు:** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం జిల్లా కేంద్రానికి చెందిన మౌనికకు సాధారణ ప్రసవంలో 4.1 కిలోల బరువు గల ఆడ శిశువు జన్మించింది. ప్రసవానంతరం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సాధారణ ప్రసవంలో అధిక బరువు గల శిశువు జన్మించడంతో గైనకాలజీ వైద్యులను, సిబ్బందిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతిరోజు 10 నుంచి 15 ప్రసవాలు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్ నాయక్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ కవిత, డాక్టర్ శిరీష, డాక్టర్ నిఖిత, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రవళిక, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు జాబ్ మేళా

**కల్వకుర్తి రూరల్:** పట్టణంలోని వైఆర్‌ఎం కళాశాల ఆవరణలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ మేకల రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో 75% మార్కులతో ఇంటర్మీడియట్ 2024–25 బ్యాచ్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు జాబ్‌మేళాలో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు.

### సంత వేలం రూ.2.91 లక్షలు

**ఉప్పునుంతల:** మండలంలోని శ్రీశైలం–హైదరాబాద్ రహదారి పక్కన వెల్టూరు స్టేజీ సమీపంలో ప్రతి ఆదివారం నిర్వహించే గొర్రెలు, మేకల సంత 2025–26 సంవత్సరానికి గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో నలుగురు టెండర్‌దారులు పాల్గొనగా బల్మూర్ మండలం గోదల్ గ్రామానికి చెందిన కలకొండ మహేష్ చారి రూ.2 లక్షల 91 వేలకు సంతను దక్కించుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్ పాల్గొన్నారు.

### కేఎల్ఐ కాల్వలో పేరుకుపోయిన జమ్ము

**పెద్దకొత్తపల్లి:** మండలంలో వివిధ గ్రామాల ద్వారా ప్రవహిస్తున్న కేఎల్ఐ కాల్వలో పేరుకుపోయిన జమ్మును తొలగించి సాగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలో కేఎల్ఐ కాల్వలో జమ్మును పరిశీలించారు. కార్యక్రమంలో భీమేష్‌రెడ్డి, బెల్లితిరుమల్‌యాదవ్, బద్దల ప్రవీణ్ యాదవ్, సరాయిశేఖర్, మేకల శివయాదవ్, బీనమోనిలింగస్వామి, మార్కండెయ, దాది లింగస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రం నుంచి దేవునితిర్మలాపురం రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరంతా వృథాగా పోతోంది. పైపులైన్ లీకేజీ వల్ల తాగునీరు కలుషితమవుతూ అదే నీరు పైపులైన్ల ద్వారా సరఫరా అవుతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతు చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఉద్యోగులకు పీఆర్‌సీని ప్రకటించాలి



**కొల్లాపూర్:** ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, ఏరియర్స్‌ను విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి టీఎస్ యూటీఎఫ్ సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వేణుమాధవ్‌గౌడ్, శంకర్, ఆర్.కృష్ణ, బి.నారాయణ, కే.శంకర్‌నాయక్, రబ్బానీపాష, గఫూర్, నారాయణ, వెంకటరమణ, కురుమయ్య, క్రాంతికుమార్ ఉన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

**బల్మూర్:** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ విష్ణుమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతను పాటించాలి

**వెల్దండ:** మండలంలోని గుండాల ఏకలవ్య పాఠశాలలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధు మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మురళీ, కృష్ణ, కవిత, జహంగీర్‌బీ, చంద్రకళ, పద్మావతి ఉన్నారు.

### జర్నలిస్టుల పక్షాన బీజేపీ పోరాటం

**కొల్లాపూర్:** జర్నలిస్టులు చేపట్టిన దీక్షలకు ప్రభుత్వ యంత్రాంగం రెండురోజుల్లో స్పందించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. కొల్లాపూర్‌లో ఇళ్ల స్థలాల సాధన కోసం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు చేపట్టిన రిలే దీక్షలు 16వ రోజు కొనసాగాయి. దీక్షా శిబిరాన్ని సుధాకర్‌రావు సందర్శించి మాట్లాడారు. జర్నలిస్టుల ఆస్తిపాస్తులను లెక్కగట్టిన మంత్రి జూపల్లి వారి పార్టీ నేతలకు ఉన్న ఆస్తులను కూడా లెక్క కట్టాలన్నారు. ముదిరాజ్ సంఘం, వడ్డెర సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

### కాంగ్రెస్ పాలనలో ప్రజాధనం వృథా

**వెల్దండ:** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజాధనం వృథా చేస్తున్నారని బీఆర్‌ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, మండల నాయకులు ప్రవీణ్‌లు పేర్కొన్నారు. గురువారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కల్వకుర్తిలోని 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి గతంలోని మాజీ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజవర్గానికి వస్తున్న మంత్రుల బృందం గతంలో చేసిన పనులకు శంకుస్థాపన చేయడం సరికాదని విమర్శించారు. పనులు ప్రారంభం చేయకుండా శంకుస్థాపన పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎంఎస్‌గౌడు, జంగిలి రవి, మట్ట రఘుగౌడు, గోరటి రాజు, దశరథం, బర్కాం గణేష్ ఉన్నారు.

### ఎంపీడీఓ బదిలీ

**చారకొండ:** మండలంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ బదిలీపై నల్గొండ జిల్లా కోదాడకు వెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సన్మానించి సత్కరించి వీడ్కోలు పలికారు. చారకొండ మండలానికి కల్వకుర్తిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విజయభాస్కర్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**లింగాల:** మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు బానిసలు కాకుండా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు కోరారు. మండలం లోని అంబట్‌పల్లి జెడ్పీ హెచ్‌ఎస్ ఆవరణలో గురువారం నల్లమల యూట్యూబ్ చానల్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నల్లమల ప్రాంతానికి చెందిన రాగం యూట్యూబ్ చానల్ సభ్యులు గంజాయిపై పాడిన పాట ఎంతో బాగుందని కొనియాడారు. అనంతరం రాగం యూట్యూబ్ చానల్ బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, హెచ్‌ఎం నిరంజన్, ఇందిర, గ్రామస్తులు పాల్గొన్నారు.

### యువతి అదృశ్యం

**కందనూలు:** యువతి అదృశ్యమైన కేసు నమోదైనట్లు ఎస్ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. బల్మూరు మండలం పోలేపల్లికి చెందిన వసంత జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. హైదరాబాద్ నుంచి సర్టిఫికెట్ల కోసం వచ్చి బుధవారం కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు యువతి కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

### మైనర్‌తో పని చేయించిన వ్యక్తిపై కేసు

**కందనూలు:** మైనర్‌తో టిఫిన్ సెంటర్‌లో పని చేయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వరలక్ష్మి టిఫిన్ సెంటర్లో మైనర్‌తో పనిచేయిస్తుండగా ఆపరేషన్ ముస్కాన్ టీం తనిఖీలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హోటల్ యజమాని సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# డిగ్రీ కళాశాలకు రోడ్డు నిర్మించాలి



మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

**కందనూలు:** జిల్లా కేంద్రంలో శ్రీపురం రోడ్డు సమీపంలో ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాలకు నూతన రోడ్డు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి ఏబీవీపీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాలకు వెళ్లే దారి గుంతలమయమైందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జూన్ 28న వినతిపత్రం ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని, తక్షణమే సంబంధిత అధికారులు నూతనంగా రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, కళాశాల ప్రెసిడెంట్ శివ, రాము, శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, మున్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మన్ననూర్ ఏఈఓ దేవి

**మన్ననూర్:** అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులకు గురువారం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. మన్ననూర్ రైతు వేదిక వద్ద కందులు, మినుములు, జొన్నలు ఒక్కో రైతుకు సంబంధించిన ఒక పట్టా పాస్ బుక్కుకు 5 కేజీల విత్తనాలు అందజేసినట్లు మన్ననూర్ ఏఈఓ దేవి తెలిపారు. ప్రభుత్వం తరపున ఇచ్చే సబ్సిడీ విత్తనాలు నాణ్యతగా భావించిన రైతులు అనేక మంది విత్తనాల కోసం రైతువేదిక వద్దకు తరలివచ్చారు. పరిమితంగా సరఫరా అయిన విత్తనాలు కొంత మంది రైతులకు మాత్రమే ఇవ్వడంతో నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్లారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



మాడాపూర్‌లో కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

**లింగాల:** వివిధ పంటల సాగులో వస్తున్న మార్పులకు అనుగుణంగా వచ్చే పద్ధతులను ఉపయోగించాలని మండల వ్యవసాయాధికారి జి.అనిల్ రైతులను కోరారు. మండలంలోని మాడాపూర్‌లో గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ డెమోలో భాగంగా దశపత్రిలో వాడే ఆకుల వివరాలను ఏఓ వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ భరత్‌కుమార్, ఆర్డీటీ సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**మొక్కజొన్న పరిశీలన**

మొక్కజొన్న పంటకు కత్తెర తెగులు ఆశించి పంటను నష్టం చేస్తాయని ఏఓ తెలిపారు. మాడాపూర్ శివారులో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఏఓతో పాటు ఏఈఓ భరత్‌కుమార్ పరిశీలించారు. కత్తెర తెగులు నివారణకు వాడే మందుల గురించి రైతులకు తెలిపారు.

# అంధత్వ నిర్మూలనకు ఐక్యత ఫౌండేషన్ తోడ్పాటు



ఆపరేషన్ చేసుకున్న వారితో మాట్లాడుతున్న సుంకిరెడ్డి

**కల్వకుర్తి రూరల్:** నియోజకవర్గంలో అంధత్వ నిర్మూలనకు ఐక్యత ఫౌండేషన్ తన వంతు సహకారం అందిస్తోందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఇప్పుడు మూడో కంటి వైద్య శిబిరం కొనసాగుతోందన్నారు. ఆరు రోజులుగా ఈ శిబిరంలో 3వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 2వేల మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. 170 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి ఇప్పటి వరకు 79 మందికి ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామాజిక సేవతో సంతృప్తి లభిస్తుందని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, గణేష్, రఘు, యాదయ్య శ్రీపతి, నాగిళ్ల శివ, కల్యాణ్ పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**వెల్దండ:** మండలంలోని కొట్ర గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం మాజీ సర్పంచ్ జంగయ్యయాదవ్ రూ.1,10,116 విరాళం అందజేశారు. ప్రజలు భక్తిభావం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, అల్లాజీ, మల్లేష్, శ్రీను, వెంకటయ్య ఉన్నారు.

### పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

**కొల్లాపూర్:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియస్ విద్యార్థులకు సూచించారు. కళాశాలలో గురువారం నేషనల్ స్టూడెంట్ పర్యావరణ పోటీలు నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్టు, ఎన్విరాన్మెంట్, అండ్ క్లైమేట్ చేంజ్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అనుసంధానంతో నిర్వహించారు. కళాశాల పరిసరాల్లో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సంతోష్ కుమార్ ఉన్నారు.

### మాసూంబాబా ఉర్సు పోస్టర్ విడుదల

**పెంట్లవెల్లి:** మండలంలోని జటప్రోల్ గ్రామంలో మాసూంబాబా 40వ ఉర్సు ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను జటప్రోల్ మాసూంబాబా దర్గా వద్ద మత పెద్దలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే ఉర్సు ఉత్సవాలను ఈ సంవత్సరం రంగరంగవైభవంగా నిర్వహిస్తున్నామ ని, 17న గంధోత్సవం, 18 న తెప్పోత్సవం నిర్వ హించనున్నట్లు తెలిపారు. మాసూంబాబా ఉర్సుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ముస్లింలు పెద్దలు సయ్యద్‌నజీరుద్దీన్‌శాఖాద్రి, మహమ్మదీన్, సయ్యద్‌గౌడ్, మతపెద్దలు పాల్గొన్నారు.

### భైరాపూర్ వంతెన పరిశీలన

**వెల్దండ:** మండలంలోని భైరాపూర్ వంతెనను ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం పరిశీలించారు. 2022లో కురిసిన వర్షాలకు బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అప్పట్లో వంతెన నిర్మాణం కోసం రూ.3.50కోట్లు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ టెండర్ వేసినా పనులు ప్రారంభించలేదు. అర్‌అండ్‌బీ అధికారులు మళ్లీ వంతె నిర్మాణం కోసం పరిశీలించి అంచనా వేశారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్‌అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్, ఈఈ దేశ్యనాయక్, ఎస్‌ఈ శివకుమార్, కాంట్రాక్టర్లు శిశుపాల్‌రెడ్డి, రాజుయాదవ్ ఉన్నారు.

### అధికారులు అందుబాటులో ఉండాలి

**తెలకపల్లి:** గ్రామాల్లో పంచాయతీ అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్లో పంచాయతీ కార్యదర్శులకు, సాంకేతిక సహాయకులు, ఫీల్డు అసిస్టెంట్లకు, మెట్లకు సమావేశం నిర్వహించారు. వనమహోత్సవం, వారంరోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటయ్య, ఏపీఓ మల్లేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### భూగర్భ కేంద్రం ఉద్యోగుల సమస్యలపై వినతి

**దోమలపెంట:** శ్రీశైలం భూగర్భ కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మిక సమస్యలపై టీఎస్ జెన్‌కో డైరెక్టర్(హెచ్‌ఆర్) ఎస్‌పీఎస్ కుమార్ రాజాను గురువారం విద్యుత్ సౌధ, హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేసినట్లు జెన్‌కో 1535 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, భూగర్భ కేంద్రం ఉద్యోగి సుంకర లవకుమార్ తెలిపారు. ప్రధానంగా కేంద్రంలో షిఫ్టు డ్యూటీలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్లు అధికంగా రీడ్ అండ్ రైట్ లేనివారు కావడం, రిటైర్మెంట్‌కు దగ్గర వారు అనారోగ్య సమస్యలతో ఉంటూ షిఫ్టు డ్యూటీలో పని చేస్తుండటం జరుగుతుందన్నారు. షిఫ్టులో ఉన్న ఆరు బ్యాచ్‌లను ఏడు బ్యాచ్‌లు చేయాలని కోరారు. స్పందించిన డైరెక్టర్ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

### ఆర్థికాభివృద్ధి సాధించాలి

**అమ్రాబాద్:** మహిళా సంఘాలు జీవనోపాధి మెరుగు పరుచుకొని తమ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం నిరంజన్ సూచించారు. గురువారం గ్రామ మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇందిర స్త్రీ శక్తి మహిళా సంఘాల విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు మస్తానమ్మ, కార్యదర్శి ప్రమీల, సీసీలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురికి జైలుశిక్ష

**తెలకపల్లి/తాడూరు:** డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగు రికి జైలుశిక్ష విధించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. రెండ్రోజుల క్రితం తెలకపల్లి–లింగాల రోడ్డులో పో లీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన సిద్దయ్యగౌడ్, సిద్దాపూర్ గ్రామానికి చెందిన కొంటె బాలపీరు, తెలకపల్లి మండలం గౌరెడ్డిపల్లి గ్రామా నికి చెందిన పులిజాల ఎల్లయ్యలు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం ఏఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ శృతిధూత ముందు హాజరు పర్చారు. సిద్దయ్యకు 24గంటల జైలు శిక్ష విధించగా, బాలపీరు, ఎల్లయ్యకు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

❖ తాడూరు మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపాన మద్యం తాగి వాహనం నడుపుతూ భూత్పూరు మండలం పాతమొల్గరకు చెందిన ఎర్రొల్ల వెంకటేష్ పట్టుబడినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ శృతిధూత ఒకరోజు జైలు శిక్ష విధించారు.

### రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**మన్ననూర్:** ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో మాచారం గ్రామ అనూష ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ అధినేత జలంధర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం అమ్రాబాద్ మండలంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో, రోగులకు స్వీట్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. లెనిటీ వృద్ధాశ్రమంలో, అనాథలకు అన్నదానం చేశారు.

### విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

**నాగర్‌కర్నూల్ రూరల్:** ప్రైవేట్ విద్యా సంస్థలలో పేద విద్యార్థులకు ఉచితంగా 25శాతం సీట్లు ఇవ్వాలని విద్యాహక్కు చట్టంలో ఉన్నా జిల్లాలో ఎక్కడ అమలు కావడం లేదని వెంటనే అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు అన్నారు. గురువారం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, అశోక్, రాజు పాల్గొన్నారు.